

..మళ్లీ అన్యాయం..!

కోల్‌కతాలో జరిగిన 11వ వేతన ఒప్పంద సమావేశంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు మరోమారు అన్యాయం జరిగింది. 8లో



హడలెత్తించిన గాలివాన

జూలూరుపాడు, అశ్వారావుపేట మండలాల్లో ఆదివారం గాలి దుమారం బీభత్సం సృష్టించింది. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 40° / 27°

జిల్లాలో సోమవారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉదయం నుంచి రాత్రి వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అభిషేకం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు పాల్గొన్నారు.

4న చండీహోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో వచ్చే నెల 4న పౌర్ణమి సందర్భంగా చండీ హోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'వెల్డర్ ట్రైనీ' రాత పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 43 వెల్డర్ ట్రైనీ కేటగిరీ–1(ఇంటర్నల్) పోస్టులకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. పోస్టుల భర్తీకి యాజమాన్యం గత మార్చిలో నోటిఫికేషన్ విడుదల చేసి, దరఖాస్తులు స్వీకరించింది. 34 మందికి హాల్ టికెట్లు పంపిణీ చేయగా, పరీక్షకు 32 మంది హాజరయ్యారని సింగరేణి జీఎం పర్సనల్ (రిక్రూట్‌మెంట్ సెల్) కె.బసవయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అధికారులు బీ.హనుమంత రావు, ధన్‌పాల్ శ్రీనివాస్, వేణుగోపాల్, శారద తదితరులు పాల్గొన్నారు.


'ఎన్టీఆర్' అవార్డు అందుకున్న చలపతిరాజు



అవార్డును అందుకుంటున్న జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా సైన్స్ ఆఫీసర్ సరస్వతీ చలపతిరాజు ఎన్టీఆర్ లెజెండర్ అవార్డును అందుకున్నారు. ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, తెలుగు సినిమా వేదిక ఆధ్వర్యంలో ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఆదివారం అవార్డులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయ విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయ, అండ్ సైన్స్ ఆఫీసర్ అవార్డును చలపతిరాజుకు ఎఫ్‌టీపీసీ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య జంగా, వర్మ పాకాలపాటి అందించారు.

'ఆవిర్భావం' ఘనంగా నిర్వహించాలి



సమీక్షిస్తున్న సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

మణుగూరు రూరల్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్స్అండ్ ప్లానింగ్) జి .వెంకటేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం మణుగూరు ఏరియాలో గనులు, డిపార్ట్‌మెంట్ల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి స్టేడియంలో సింగరేణి సాధించి ప్రగతిపై ఫొటో గ్యాలరీని ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం ఓసీ–4 వ్యూ పాయింట్‌ను, కేపీయూజీ గనిని సందర్శించి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జీఎం దుర్గం రాంచందర్, అధికారులు లలిత్‌కుమార్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, వెంకటేశ్వర రెడ్డి, మధుసూదన్‌రావు, శోభన్, రామేశ్వర రావు, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కవోని దీక్షతో..



పెనగడప నర్సరీలో పెంచుతున్న మొక్కలు

తొమ్మిదో విడత హరితహారానికి సన్నద్ధం

- జిల్లాలో 523 నర్సరీల్లో 65 లక్షల మొక్కల పెంపకం
- రైతుల కోసం 20 లక్షల టేకు మొక్కలు

చుంచుపల్లి: తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఆరు నెలలుగా గ్రామ పంచాయతీల్లోని హరిత నర్సరీల్లో కావాల్సిన మొక్కలు పెంచుతున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా వీటిని నిర్వహిస్తుండగా, జిల్లా, మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో 481 హరిత నర్సరీలు, అటవీ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో మరో 42 నర్సరీల్లో వచ్చే హరితహారానికి మొక్కలను సిద్ధం చేస్తున్నారు. వీటితో పాటు ఉద్యానవన నర్సరీల్లో కొన్ని మొక్కలు పెంచుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీల్లో 20 వేలు, చిన్న గ్రామ పంచాయతీల్లో 10 వేల చొప్పున 20 రకాల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. కానుగ, వేప, చింత, నేరేడు, గుల్‌మొహర్, జామ, వెలగ, శిశు, మునగ, సీమ తంగేడు, తులసి, గులాబీ, మందార, గన్నేరు, దిరిశన, బొప్పాయి, టికోమ, బహునియా, సెల్టోఫాం తదితర రకాల మొక్కల పెంపకం చేపట్టారు. ఈ మొక్కలను గ్రామాల్లో అంతర్గత, అనుసంధాన రోడ్లకు ఇరువైపులా, చెరువు, కాలువ కట్టలు, ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు నాటుకునేందుకు వీలుగా పూలు, పండ్లు, టేకు, వేప తదితర మొక్కలను పంపిణీ చేయనున్నారు. ఇందుకు మొక్కలు నాటాల్సిన లక్ష్యాలను ప్రభుత్వ శాఖల వారిగా సిద్ధం చేశారు. గతేడాది నర్సరీల్లో రికార్డు స్థాయిలో 1.50 కోట్ల మొక్కలను పెంచి హరితహారంలో నాటారు.

జూలైలో నాటనున్న అధికారులు

ఈసారి కూడా గతంలో మాదిరిగానే హరితహారంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. జూలైలో హరితహారం చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. తొమ్మిదో విడత హరితహారం కోసం 523 నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. వీటిలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో 481 హరిత నర్సరీల్లో దాదాపు 50 లక్షల మొక్కల పెంపకం చేపట్టారు. అటవీ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో మరో 40 లక్షల వరకు మొక్కలను మరో 42 నర్సరీల్లో పెంచుతున్నారు. ఇవి కాకుండా అవెన్యూ ప్లాంటేషన్ కోసం బయట నుంచి మరికొన్ని పెద్ద మొక్కలు సమకూర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సారి హరితహారంలో జిల్లాలో 65.14 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్ష్యాల కేటాయింపుల్లో పలు ప్రభుత్వ శాఖలకు కేవలం 500 మొక్కలు మాత్రమే అప్పగించారు. అలాంటివి 13 శాఖల వరకు ఉన్నాయి. డీఆర్డీఏ ఆధ్వర్యంలో రైతులకు అందించేందుకు ప్రత్యేకంగా 20 లక్షల వరకు టేకు మొక్కలను సిద్ధం చేస్తున్నారు. అడిగిన ప్రతి సన్నకారు, చిన్నకారు రైతుకు ఎకరానికి 100 వరకు టేకు మొక్కలను ఇవ్వనున్నారు. నాటిన టేకు మొక్కలను రక్షించుకునేందుకు రైతులకు ఈజీఎస్ పథకం ద్వారా నగదు కూడా చెల్లిస్తుంటారు. హరితహారంలో నాటే మొక్కల్లో కచ్చితంగా 85శాతం బతికేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకోసం ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, ట్యాంకర్‌ను కేటాయించారు. ఏడాది పొడవునా వాచర్ల ద్వారా హరితహారంలో నాటిన మొక్కలను నీరు సరఫరా చేస్తూ వాటిని సంరక్షించేందుకు చర్యలు చేపడతారు.

ప్రభుత్వశాఖ	నాటే మొక్కలు
డీఆర్డీఏ	30,00,000
ఫారెస్ట్ శాఖ	10,00,000
సింగరేణి	10,00,000
టీఎస్ఎఫ్‌డీసీ, కొత్తగూడెం	1,62,000
టీఎస్ఎఫ్‌డీసీ, పాల్వంచ	2,70,000
కొత్తగూడెం మున్సిపాలిటీ	1,50,000
పాల్వంచ మున్సిపాలిటీ	1,50,000
ఇల్లెందు మున్సిపాలిటీ	1,00,000
మణుగూరు మున్సిపాలిటీ	1,00,000
ఎక్సైజ్‌శాఖ	1,00,000
అగ్రికల్చర్	1,00,000
ఇరిగేషన్	50,000
ఇండస్ట్రీస్	25,000

లక్ష్యాలు కేటాయించాం



ఈ ఏడాది చేపట్టబోయే హరితహారానికి కావాల్సిన మొక్కలు సిద్ధం చేస్తున్నాం. ఇందుకోసం గ్రామ పంచాయతీలు, అటవీ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక నర్సరీలో మొక్కలను పెంచుతున్నాం. శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాలను ఇప్పటికే కేటాయించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు హరితహారాన్ని అన్నిశాఖల సహకారంతో పెద్దఎత్తున చేపట్టి విజయవంతం చేసేందుకు చర్యలు చేపడతాం.

–జీ.మధుసూదన్‌రాజు, డీఆర్డీఓ

అంగన్‌వాడీలకు సన్నబియ్యం

- వచ్చే నెల నుంచి మధ్యాహ్న భోజనానికి వినియోగం
- జిల్లాలో 79,253 మందికి ప్రయోజనం



భద్రాచలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు, గర్భిణులు(ఫైల్)

భద్రాచలంఅర్బన్: మాతా, శిశు సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం వచ్చే నెల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం పంపిణీ చేయనుంది. ఆరోగ్యలక్ష్మి పథకంలో లబ్ధిదారులకు మధ్యాహ్న భోజనం సన్న బియ్యంతో వండనున్నారు. జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో 1,434 మెయిన్, 626 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 79,253 మందికి లబ్ధి చేకూరనుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుతిళ్లు, పాలు, గుడ్డుతో పాటు బాలామృతం, ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్ల వయసు పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలకు పోషకాలతో కూడిన భోజనం అందిస్తున్నారు. ఇప్పటివరకు దొడ్డు బియ్యం కావడంతో చాలామంది భోజనం చేయడం లేదు. ఇటీవల నూతన సచివాలయం ప్రారంభం సందర్భంగా సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఇందుకయ్యే ఖర్చును మహిళా, శిశు సంక్షేమ శాఖ భరించాలని నిర్ణయించింది. లబ్ధిదారుల్లో పోషకాహార లోపం, రక్తహీనతను అధిగవించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. మొత్తం 79,253 మంది లబ్ధిదారులు ఉండగా, వీరిలో 8,517 మంది గర్భిణులు, 8,095 బాలింతలు, ఆరు నెలల నుంచి 3 సంవత్సరాల లోపు చిన్నారుల 34,108 మంది, 3 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 28,957 మంది ఉన్నారు. పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని ప్రభుత్వ టీచర్, సర్పంచ్, ఆవాస ప్రాంత పెద్దలు, పిల్లల తల్లిదండ్రులతో కూడిన కమిటీని కూడా ప్రభుత్వం నియమించింది.

బియ్యం నేరుగా కేంద్రాలకే..



ఆరోగ్యలక్ష్మి పథకం కింద సన్న బియ్యంతో కూడిన భోజనం అందించేందుకు మార్గదర్శకాలు జారీ చేశారు. నెలాఖరులోగా అంగన్‌వాడీ కేంద్రాలకు గోదాముల నుంచి బియ్యం అందిస్తారు. రక్తహీనతను అధిగమించేందుకు ఉపయోగపడుతుంది.

– సబిత , మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి

హర్షణీయం..



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారంతా పేదలే. ఆర్థిక పరిస్థితుల కారణంగా బలవర్థకమైన ఆహారం తీసుకోలేని పరిస్థితి. మాలాంటి వారి మేలు కోరి రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యంతో భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేయడం సంతోషం.

–విజయలక్ష్మి, గర్భిణి, భద్రాచలం

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు విరాళం అందజేశారు. మణికొండలోని అపర్ణ వెస్ట్ సైడ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన ముమ్మడి వాసుదేవ రెడ్డి, ప్రసన్న దంపతులు రూ. లక్ష నగదును అధికారులకు అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది సాయిబాబు, ఆర్‌వి నర్సింహారావు పాల్గొన్నారు.

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్/అశ్వాపురం/ఇల్లెందు: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో రూ.4 కోట్లతో టేకులచెరువు రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అశ్వాపురం మండలం ఆనందాపురం గ్రామంలో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ నివాసంలో తేనీటి విందుకు హాజరవుతారు. ఉదయం 9.45 గంటలకు అశ్వాపురం మండలం నెల్లిపాకలో రూ.1.80 కోట్లతో రాళ్లవాగు బ్రిడ్జికి, 10.15 గంటలకు తుమ్మలచెరువులో రూ.5 కోట్లతో తుమ్మలచెరువు లోతువాగు వంతెనకు, 10.35కు గొందిగూడెంలో రూ.7 కోట్లతో రోడ్డు, హైలెవల్, లోలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో జరిగే సమావేశంలో మంత్రి పాల్గొంటారు.11.45 గంటలకు మణుగూరు మండలం గట్టుమల్లారంలో ఎంపీఐ యూనిట్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. 12.05 గంటలకు మణుగూరులో బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద రోడ్డు వెడల్పు పనులకు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు, 12.25 గంటలకు అంబేద్కర్ సెంటర్‌లో మణుగూరు–నెలిపాక రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కొత్తగూడెం జిల్లా ఐడీఓసీలో తెలంగాణ అవతరణ వేడుకలపై అధికారులతో సమీక్షించనున్నారు. 5 గంటలకు ఇల్లెందులో నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొంటారు. రాత్రి 7 గంటలకు తిరిగి ఖమ్మం చేరుకుంటారు.

4న ప్రజాగర్జనకు తరలిరావాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థల పరిరక్షణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీల అమలు కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, నాయకులు మామిడిపెల్లి బుచ్చిరాములు, శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల జమలయ్య, మాచర్ల శ్రీను, కందుల జ్ఞానయ్య, కత్తెర రవీందర్, కిషోర్, మోతుకూరి శంకర్, అంజయ్య, దాసరి జ్యోతి, మహంకాళి నారాయణ, బోయిన సత్యనారాయణ, మామిడిపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణపుష్పార్చన





వేడుకలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలుచేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామి వార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారి సేవల్లో పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఆరా..

- భద్రాచలం ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం
- వైద్యులు, అధికారులకు అవగాహన కార్యక్రమం



ప్రభుత్వ పథకాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న కేంద్ర బృందం సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలపై కేంద్ర బృందం ఆరా తీసింది. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో గిరిజనులకు వైద్యం అందుతున్న తీరు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పథకాలపై అవగాహన కార్యక్రమాల గురించి తెలుసుకుంది. నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ) బృందం ఆదివారం భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించింది. బృందంలో అడ్వైజర్ డాక్టర్ బాలసుబ్రమణ్యంతోపాటు డాక్టర్ అనంత్ కుమార్, డాక్టర్ షాహిద్ అలీ, డాక్టర్ సంజీవ్ కుమార్ గుప్తా, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ అనంత పద్మనాభ భట్, డాక్టర్ జవహర్ తదితరులు ఉన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి, మొబిలైజేషన్, టెక్నికల్ అసిస్టెన్స్ తదితర అంశాలలో 2007 నుంచి కేంద్ర వైద్య ఆరోగ్య శాఖతో కలిసి ఈ సంస్థ సహకారం అందిస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో గడిచిన ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాలను పరిశీలించేందుకు వచ్చారు. 11 మందితో కూడిన ఈ బృందంలో కేంద్ర ప్రభుత్వ అధికారులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూడా ఉన్నారు. తొలుత భద్రాచలం ఆస్పత్రిలో డీఎంహెచ్ఓ జేవీఎల్ శిరీష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. స్థానిక వైద్యులతోపాటు జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో గిరిజనులకు వైద్యం అందుతున్న తీరును పరిశీలించారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించాలని, సరైన సమయంలో చికిత్స అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. మరో మూడు రోజులు జిల్లాలో పర్యటించనున్న ఈ బృందం సభ్యులు కేంద్ర ప్రభుత్వ నిధులతో కల్పించిన సదుపాయాలను పరిశీలించనున్నారు. కేంద్ర బృందానికి తొలుత డీఎంహెచ్ఓతోపాటు జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబు నాయక్, భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు, సిబ్బంది సుకృత, రాజ్‌కుమార్, రాజశేఖర్ రెడ్డి, సంతోష్, మణికంఠారెడ్డి, బాలాజీ, చైతన్య, ఇమ్మానుయేల్, దుర్గ, మోహన్, విజయకుమారి, భద్రు, వీసాల కృష్ణయ్య, పాల్గొన్నారు.

ముగిసిన క్రీడోత్సవాలు



విజేతలతో ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివాసీ స్పోర్ట్స్ ఫౌండేషన్, ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఆదివాసీ గిరిజన యువజన క్రీడోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు చివరి రోజు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య బహుమతులను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి, డాక్టర్ తెల్లం వెంకట్రావు, మడివి లక్ష్మణరావు, వర్స నాగేశ్వరరావు, ఆధార్ సొసైటీ సమన్వయ నాయకులు పోడియం బాలరాజు, కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, జయబాబు, కృష్ణ, రవివర్మ, కోచ్‌లు పాల్గొన్నారు.

8 నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

జిల్లా మత్స్య శాఖాధికారి వీరన్న



వివరాలు వెల్లడిస్తున్న మత్స్యశాఖాధికారి వీరన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): మృగశిర కార్తెను పురస్కరించుకుని జూన్ 8,9,10 తేదీల్లో జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖాధికారి బి.వీరన్న తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'కి వివరాలు వెల్లడించారు. మొత్తం 10 స్టాళ్లలో ఫిష్ కర్రీ, ఫిష్ బిర్యానీ, ఫిష్ ఫ్రై, ఫిష్ పచ్చడి, ఫిష్ పకోడి తదితర చేపల వంటకాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు మత్స్య సొసైటీలో 525 మంది సభ్యులు ఉన్నారని, దీంతో జూన్ 8న అక్కడ చెరువుల పండుగ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 60 సొసైటీల్లో 3500 మంది సభ్యులు ఉన్నారని, వీరంతా ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్‌కు హాజరవుతారని వివరించారు. పశుసంవర్ధక శాఖ, వ్యవసాయశాఖ, ఫైర్ శాఖ, విద్యుత్ శాఖ, మున్సిపాలిటీ, పశుసంవర్ధక శాఖల సహకారంతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న చెరువుల్లో 1.80 కోట్ల బొచ్చె, రవ్వ, బంగారుతీగల సీడ్ ఉచితంగా వేసినట్లు చెప్పారు. మాంసాహారాల్లో ఫిష్ అత్యంత శ్రేష్ఠమైనదని, పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. వివిధ రకాల రోగగ్రస్తులు కూడా చేపలు తినవచ్చని వివరించారు. బస్టాండ్లలో ఫిష్ రెస్టారెంట్ల ఏర్పాటు కోసం ఆర్టీసీ అధికారులకు లేఖలు రాశామని తెలిపారు. సొసైటీ సభ్యులు ఫిష్ రెస్టారెంట్లు నిర్వహించేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఫెస్టివల్‌కు కలెక్టర్ అనుదీప్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు.

క్లుప్తంగా

పాల్వంచవాసికి పురస్కారం


అవార్డు అందుకుంటున్న చక్రధరాచారి

పాల్వంచరూరల్: పాల్వంచకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ బోయినపల్లి చక్రధరాచారికి విశ్వకర్మ అవార్డు దక్కింది. ఏపీలోని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ విశ్వకర్మ సమ్మిట్–2023.. విశ్వకర్మ లెజెండరీ అవార్డ్స్ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన విశ్వకర్మలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ మేరకు పాల్వంచకు చెందిన చక్రధరాచారికి జోతిష్యశాస్త్రం విభాగంలో అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షుడు తోలేటి శ్రీకాంతాచారి, విశ్వనాథుల పుష్పగిరి, నల్లూరి రాంప్రసాద్‌చారి పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో మోకాలు శస్త్రచికిత్స


కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న బలరాం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో ఓ పేషంట్‌కు వైద్యులు మోకాలు చిప్ప మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. కాగా, సదరు పేషంట్ కృష్ణమూర్తిని ఆదివారం సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ పరామర్శించి మాట్లాడారు. ఇలాంటి శస్త్రచికిత్సలకు కావాల్సిన పరికరాలను అందుబాటులోకి తెచ్చేందుకు సింగరేణి సంస్థకు ముందుంటుందని తెలిపారు. శస్త్రచికిత్సకు సహకరించిన వైద్యులు సీఎంఓ వెంకటేశ్వరరావు, విక్రమ్, నాగరాజు, రేష్మ, సువర్ణరేఖ, కృష్ణమూర్తిని బలరాం అభినందించారు.

'అల్లం'కు ఎన్టీఆర్ స్మారక పురస్కారం


పురస్కారం అందుకుంటున్న నాగేశ్వరరావు

భద్రాచలంటౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు, భద్రాద్రి కళాభారతి వ్యవస్థాపకుడు అల్లం నాగేశ్వరరావుకు విశాఖపట్నంలో ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ స్మారక పుస్కారం అందజేశారు. దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావుకు పురస్కారం ప్రదానం చేశారు.

భారీగా గంజాయి స్వాధీనం


నిందితులు వదిలేసిన కారు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు భారీగా గంజాయి పట్టుబడింది. వివరాలిలా ఉన్నాయి.. శనివారం రాత్రి నుంచి పట్టణంలోని కూనవరం రోడ్డులో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా 500 కేజీల గంజాయి పట్టుబడింది. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా మరో వాహనంలో కూడా గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం తెలిసింది. అప్రమత్తమైన పోలీసులు అక్కడే తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కూనవరం రోడ్డులోని ఓ పెట్రోల్ బంక్‌లో కొందరు వ్యక్తులు కారును వదిలేసి వెళ్లినట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి కారును క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో ఆడవారి దుస్తులు విక్రయించినట్లు డబ్బాలను అమర్చి అలాంటి డబ్బాల్లోనే గంజాయి నింపి ఉంచారు. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. కాగా, కారులో 450 కేజీల గంజాయి ఉన్నట్లు సమాచారం. కొన్ని గంటల వ్యవధిలోనే పోలీసులు దాదాపు 1000 కేజీల గంజాయిని పట్టుకున్నారు. కారును వదిలేసి పారిపోయిన నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అయితే, సదరు కారు పట్టణంలోని మెడికల్‌కాలనీకి చెందిన వ్యక్తిదని తేలినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే, ట్రాక్టర్‌లో పట్టుబడిన నిందితులు చెప్పిన వాహనం ఈ కారేనా? లేదా మరో వాహనంలో గంజాయి తరలిపోయి ఉంటుందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని ఓ పోలీస్ అధికారి తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికులకు మళ్లీ అన్యాయం..!


గనిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

- కాంట్రాక్ట్ కార్మికులను పట్టించుకోని జాతీయ కార్మిక సంఘాలు
- 11వ వేతన ఒప్పందంలో చర్చించని సమస్యలు
- 9వ వేతన సమావేశంలో కుదిరిన హైపవర్ వేతనాల అమలులో జాప్యం

సింగరేణి(కొత్తగూడెం): పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో ఈ నెల 18, 19 తేదీల్లో జరిగిన 11వ వేతన ఒప్పంద సమావేశంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు మరోమారు తీవ్ర అన్యాయం జరిగిందని తెలుస్తోంది. 9వ వేతన ఒప్పందం 2013లో కుదిరిన కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు ఇవ్వాలనే ఒప్పందంపై జాతీయ కార్మిక సంఘాలు పెదవి విప్పలేదని, దీంతో వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కారానికి నోచుకోలేదని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కనీసం కాంట్రాక్ట్ కార్మికుల ఊసెత్తకుండానే 11వ వేతన ఒప్పందం ముగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్మనెంట్ కార్మికుల కోసం 10 సమావేశాలు నిర్వహించి నానా రభస చేసిన జాతీయ కార్మిక సంఘాల నాయకులు కాంట్రాక్ట్ కార్మికులను ఏమాత్రం పట్టించుకోకపోవడం విచారకరమని వాపోతున్నారు.

నాటి హామీలను నిలబెట్టుకోవాలి..



గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన 19 రోజుల సింగరేణి సమ్మె సందర్భంగా జాతీయ కార్మిక సంఘాల అగ్రనేతలు ఇచ్చిన హామీలను కచ్చితంగా నిలబెట్టుకోవాలి. అప్పుడు ఒక మాట ఇప్పుడొక మాట మాట్లాడటం, ద్వంద్వ వైఖరి అవలంబించడం సరి కాదు. 32 వేల కాంట్రాక్ట్ కార్మికుల కష్టాన్ని గుర్తించని నాయకులు నాయకులే కాదు. నాయకులు అందరికీ సమన్యాయం చేయాలి.

– నెమ్మిళ్ల సంజీవ్, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు

ఓటు హక్కు కోసం మరో ఉద్యమం



సింగరేణికి కోట్లాది రుపాయల లాభాలు వస్తున్నాయంటే కేవలం కాంట్రాక్ట్ కార్మికుల మూలంగానే. అయినా కూడా వారికి చట్టబద్ధ హక్కులు అమలు చేయటం లేదు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు లేని కారణంగా వారి పట్ల యాజమాన్యం, కార్మిక సంఘాల నేతలు వివక్ష చూపుతున్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం మరో ఉద్యమం చేస్తాం.

– ఎస్‌కే యాకూబ్‌షావలి, ఎస్సీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు

స్పీడ్ బ్రేకర్లను తొలగించిన అధికారులు



జేసీబీతో స్పీడ్ బ్రేకర్‌లను తొలగిస్తున్న పోలీసులు

భద్రాచలం: భద్రాచలంలో బ్రిడ్జి సెంటర్‌లో ప్రమాదాలకు నిలయంగా మారి వాహనదారుల ప్రాణాలను హరిస్తున్న స్పీడ్ బ్రేకర్లను ఆదివారం పోలీసులు తొలగించారు. స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా ఉండటంతోపాటు రాత్రి వేళ వెలుతురు లేక సరిగ్గా కనిపించకపోవడంతో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే ప్రదేశంలో ఈ నెల 8న లకావత్ బేబి, గత శనివారం తెల్లవారుజామున దుమ్ముగూడెం మండలానికి చెందిన కాళ్ల వినోద్ మృతిచెందారు. స్పీడ్ బ్రేకర్లే ప్రమాదాలకు కారణమవుతున్నాయని 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. సోషల్ మీడియాలో కూడా వీటిపై వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో పోలీసులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాలతో ట్రాఫిక్ ఎస్సై పీవీఎన్ రావు జేసీబీ సహకారంతో ఆ స్పీడ్ బ్రేకర్లను తొలగించారు. ప్రమాదాలు జరగకుండా రేడియం హెచ్చరిక బోర్డులు, ముఖ్యమైన కూడళ్లలో జీబ్రా క్రాసింగ్ లైన్లను ఏర్పాటు చేయాలని ఏఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై పీవీఎన్ రావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాఫిక్ ఎస్ఐకి సూచనలు చేస్తున్న ఏఎస్పీ

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించటం ప్రమాదకరం. శనివారం తెల్లవారుజామున ఘటనలో హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు దక్కి ఉండేవి. కార్లలో సీట్‌బెల్ట్‌లు ధరించాలి.మద్యం తాగి వాహనాలను నడపకూడదు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. పట్టుబడితే ఇద్దరూ శిక్షార్హులే. –పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ

హడలెత్తించిన గాలివాన

- పదుల సంఖ్యలో పూరిళ్లు నేలమట్టం
- తృటిలో తప్పిన ప్రాణనష్టం
- విరిగిపడిన వృక్షాలు, కరెంటు స్తంభాలు

జూలూరుపాడు: మండలంలో ఆదివారం గాలి దుమారంతో కూడిన వాన బీభత్సాన్ని సృష్టించింది. మాచినేనిపేటతండా, కాకర్ల, మాచినేనిపేట తదితర గ్రామాల్లో రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. మాచినేనిపేటతండాకు చెందిన భూక్యా సాల్కీ, వాంకుడోత్ చిన్నా, వాంకుడోత్ బిల్లు, పుల్లూరి ముత్తులింగం, వాంకుడోత్ కవిత రేకుల ఇళ్ల పైకప్పు ఎగిరిపోయింది. రేషన్ డీలర్ బానోత్ లోక్యా ఇంటి పైకప్పు ఎగిరిపోవడంతో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం తడిసిపోయింది. గ్రామంలోని వన నర్సరీ షేడ్‌నెట్ ధ్వంసమైంది. మాచినేనిపేటతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంపై చెట్టు విరిగిపడటంతో పాక్షికంగా దెబ్బతిన్నది. ఇదే గ్రామానికి చెందిన భూక్యా సాల్కీ ఇంటికి పైకప్పు లేచిపోవడంతో ఇంట్లో ఉన్న బానోత్ సరోజ తలకు గాయమైంది. కాకర్ల గ్రామానికి చెందిన పదిమల పెద్ద కృష్ణయ్య ఇంటి పైకప్పు ఎగిరిపోయింది. పడమటనర్సాపురం – భేతాళపాడు గ్రామాల మధ్య చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయిరాంతండా వద్ద మెయిన్ రోడ్‌పై చెట్టు విరిగిపడటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక పోలీసులు రోడ్డుపై పడిన చెట్లను స్థానికుల సాయంతో తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. వినోభానగర్ గ్రామ సమీపంలో 33 కేవీ లైన్ విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచింది.


పడమటనర్సాపురం గ్రామ సమీపంలో విరిగిపడిన చెట్టు

అశ్వారావుపేటరూరల్: మండలంలో ఆదివారం సాయంత్రం గంట పాటు వీచిన పెనుగాలులకు పదుల సంఖ్యలో పూరిళ్లు నేలమట్టం కాగా, పలుచోట్ల పెద్ద వృక్షాలు, కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడగా, ఓ వ్యక్తి తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మల్లాయిగూడెం, నారంవారిగూడెం, అశ్వారావుపేటలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ పెనుగాలులకు మల్లాయిగూడెం గ్రామంలో పది పూరిళ్లు కూలిపోగా.. మరో పదిహేను రేకుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. గాలికి ఇళ్ల పైరేకులు 20 అడుగుల ఎత్తుకు ఎగిరి చెట్ల కొమ్మల మధ్యలో ఇరుక్కున్నాయి. ప్రజలు భయంతో పరుగులు తీశారు. గ్రామంలో ఇళ్లు కూలిపోవటంతో దాదాపు 25 కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. గ్రామానికి చెందిన పోతునూరి సత్తిబాబు, అతని బంధువు వెంకటేశ్ వర్జీనియా పొగాకు బ్యారన్ దగ్గరకు వెళ్లగా అదే సమయంలో బ్యారన్ కూలిపోవడంతో వారిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించారు. అశ్వారావుపేట లోని కొణంగులబజారులో రేకుల షెడ్డు ఈదురుగాలులకు ఎగిరిరోడ్డుపై పడింది. పక్కనే ఉన్న కరెంటు స్తంభం విరిగిపోయింది.షెడ్డు ఇనుప రాడ్లు ఇళ్లలోకి చొచ్చుకొని రాగా, ఇంట్లో నిద్రిస్తున్న ఓ వ్యక్తి తృటిలో తప్పించుకున్నాడు.


కాకర్లలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు


మల్లాయిగూడెంలో కూలిన రేకులు


నారంవారిగూడెంలో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఇద్దరు మృతి

దమ్మపేట: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందిన ఘటన మండలంలోని మందలపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం, మల్లెబోయినపల్లి గ్రామానికి చెందిన శ్రీశైల చిరంజీవి (29), కొత్తగూడెం పట్టణంలోని కోరమాండల్ ఫర్టిలైజర్స్ దుకాణంలో సేల్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. హైదారాబాద్‌లోని కొత్తపేటకు చెందిన భీమవరపు వెంకటరామ నర్సింహారావు(44), సత్తుపల్లి పట్టణంలోని కోరమాండల్ ఫర్టిలైజర్స్ దుకాణంలో సేల్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో శనివారం రాత్రి జరిగిన వార్షికోత్సవానికి హాజరైన వారు బైక్‌పై సత్తుపల్లి పట్టణానికి తిరుగు పయనమయ్యారు. శనివారం రాత్రి 2 గంటల సమయంలో మండలంలోని మందలపల్లి గ్రామం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన లారీ వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. బైక్ వెనుక కూర్చున్న చిరంజీవి తలపై నుంచి లారీ టైరు ఎక్కడంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న నర్సింహారావును లారీ కొంతదూరం ఈడ్చుకెళ్లగా తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. చిరంజీవి బాబాయి శ్రీశైల వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు: మండలంలోని జూలూరుపాడు – చంద్రుగొండ మధ్యగల రోడ్డుపై వెంగన్నపాలెం శ్రీముత్యాలమ్మ దేవాలయం వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పాపకొల్లు గ్రామ పంచాయతీ బచ్చలకోయగూడెంనకు చెందిన జబ్బా మధు, ముక్తి నాగరాజు గుండెపుడి గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్నారు. గుండెపుడి గ్రామ పంచాయతీకి చెందిన తాటి అప్పారావు, నల్లబండబోడుకు చెందిన బచ్చల శ్రీను బైక్‌పై జూలూరుపాడులో పని ముగించుకొని గుండెపుడి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో వెంగన్నపాలెం శ్రీముత్యాలమ్మ తల్లి ఆలయం వద్దకు రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముక్తి నాగరాజు, జబ్బా మధుకు తీవ్ర గాయాలు కాగా, తాటి అప్పారావు, బచ్చల శ్రీనులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, ప్రమాద వివరాలను సేకరించి, విచారణ చేపట్టారు.


రోడ్డు పక్కన పడిపోయిన నాగరాజు, మధు

మిలీషియా సభ్యుడు అరెస్ట్

దుమ్ముగూడెం: మండలంలోని పైదిగూడెం అటవీ ప్రాంతంలో మావోయిస్ట్ మిలీషియా సభ్యుడిని అరెస్ట్ చేసినట్టు సీఐ దోమల రమేశ్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ నర్సిరెడ్డి పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్‌తో పైదిగూడెం అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించి పారిపోతుండగా పట్టుకుని విచారించారు. వారిలో సోది ముయ్యు అలియాస్ అనిల్ కిష్టారం ఏరియా కమిటీ మావోయిస్టు మిలీషియా సభ్యుడిగా పనిచేస్తున్నట్లు తేలిందని పోలీసులు తెలిపారు. సుక్మా జిల్లా ఎంటపాడుకు చెందిన అతడి వద్ద నుంచి కరపత్రాలు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశామని సీఐ వివరించారు.

- ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా చింతగుప్ప గ్రామానికి చెందిన గణపత్ సాడియా అనే వ్యక్తిని పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న గణపత్‌ను శనివారం అర్ధరాత్రి తీసుకెళ్లిన మావోయిస్టులు.. తమ వివరాలను పోలీసులకు చేరవేస్తున్నాడంటూ దారుణంగా నరికి చంపారు. కాగా, ఈ ఘటనను సుకుమా పోలీసులు ధ్రువీకరించారు.

ఆర్టీసీ బస్సులో పొగలు


బస్సు నుంచి వెలువడుతున్న పొగ

అశ్వారావుపేటరూరల్: ఆర్టీసీ బస్సులో అకస్మాత్తుగా పొగలు వ్యాపించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా... భద్రాచలం నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ బస్సు అశ్వారావుపేట బస్టాండ్‌కు వచ్చింది. అయితే, ఒక్కసారిగా బస్సులో దట్టమైన పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో బస్‌లో మొత్తం 35 మంది ప్రయాణికులున్నారు. అప్రమత్తమైన డ్రైవర్ వెంకటేశ్వరరావు బస్టాండ్‌లోని ఆర్టీసీ సిబ్బందితో కలిసి పొగలను అదుపు చేశారు. ఎండవేడికి వైర్లు వేడెక్కి పొగలు వచ్చాయని భయపడాల్సిన అవసరం లేదని డ్రైవర్ ప్రయాణికులకు ధైర్యం చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇంజన్ చల్లబడిన తర్వాత వైర్లకు మరమ్మతులు చేసి ప్రయాణికులను తీసుకొని బస్సు రాజమండ్రి బయలుదేరింది.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి


నాగేశ్వరరావు (ఫైల్)

సుజాతనగర్: వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నాయకులగూడెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చల్లా నాగేశ్వరరావు(36) వ్యవసాయ బావి చుట్టూ చెత్త ఉందని తొలగించేందుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. నాగేశ్వరరావుకు చెందిన ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ బావి సమీపంలో ఉన్నాయి. బావి వద్దకు మృతుడి బంధువొకరు వచ్చి కాలు జారి బావిలో పడి చనిపోయి ఉంటాడని నిర్ధారించుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. తన కుమారుడు ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోయి మృతి చెందాడని మృతుని తండ్రి చల్లా వెంకయ్య పోలీసులకు ఫిర్యాదు ఇచ్చాడు. కానీ, ఆర్థిక కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సుమారు రూ.7 లక్షల మేర మోసం చేయగా అదే ఇతడి మరణానికి కారణమని తెలుస్తోంది. మోసగించిన వ్యక్తుల నుంచి తన కుటుంబ సభ్యులకు నగదును ఇప్పించాలని సూసైడ్ నోట్ కూడా రాసినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా, నాగేశ్వరరావు సోదరుడు సైతం ఐదేళ్ల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు. నాగేశ్వరరావు మృతి విషయం తెలుసుకున్న ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గాయపడిన వ్యక్తి...

అన్నపురెడ్డిపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాతబూర్గుడెం గ్రామానికి చెందిన తగిర్ళ ఆదినారాయణ (45) ద్విచక్రవాహనంపై శనివారం అబ్బుగూడెంలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. తిరి గి ఇంటికి వస్తున్న క్రమంలో బూర్గుడెం మలుపు వద్ద ప్రమాదవశాత్తు వాహనం పైనుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మం తీసుకెళ్లే క్రమంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఎస్ఐ షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: అదనపుకట్నం కోసం భర్త, అత్త, మామ, మరిది వేధింపులకు గురిచేస్తున్నారని ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని భగవాన్‌దాస్‌కాలనీకి చెందిన మానసకు ఐదేళ్ల కిందట కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలానికి చెందిన అనిల్‌తో వివాహమైంది. కాగా, రెండేళ్లుగా భర్తతోపాటు అతడి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

పాలనలో నయా పంథా

సంస్కరణలతో విప్లవాత్మక మార్పులు

- పల్లె, పట్టణ ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలు
- దేశ చరిత్రలోనే తొలిసారిగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ
- వాటిలో కొత్తగా 1.34 శాశ్వత ఉద్యోగాల భర్తీ
- ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున సేవా వ్యవస్థ
- నవరత్నాల పథకాల ద్వారా రూ.2.11 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ

సాక్షి, అమరావతి: కేవలం నాలుగేళ్లలోనే సంస్కరణల ద్వారా పరిపాలన వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రం చిరునామాగా మారింది. సామాజిక బాధ్యతగా విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో అందించాల్సిన సేవల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు, సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పాలనా వ్యవస్థల్లో మార్పులు కొట్టొచ్చినట్లు కనిపించేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సర్కారుకే దక్కుతుంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకే అధికారాలు, విధులు అప్పగించాలనే మాటలను సాక్షాత్కరింప చేసిన ఏకైక రాష్ట్రంగా నిలిచింది ఏపీనే. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి.. పల్లె, పట్టణ ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలను అందిస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే (2019) కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేసి, చేతులు దులుపుకోకుండా.. ఆ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఉద్యోగులు, సిబ్బందిని భర్తీ చేసింది. దేశ చరిత్రలోనే తొలిసారిగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలతో పక్కా వ్యవస్థ ఏర్పాటు చేసింది. వీటిలో 1.34 లక్షల శాశ్వత ఉద్యోగాలను కొత్తగా సృష్టించి.. భర్తీ చేసింది. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున ప్రజల చేయి పట్టుకుని నడిపించే సేవా వ్యవస్థను తీసుకొచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాలతో అనుసంధానమై 2.65 లక్షల మంది వలంటీర్లుగా గ్రామాల్లో పని చేస్తున్నారు. తద్వారా 600 పౌర సేవలు ఎటువంటి లంచాలు, వివక్షకు తావు లేకుండా అందుతున్నాయి. మారుమూల పల్లెల్లో సైతం ఎక్కడ చూసినా పౌర సేవల్లో గొప్ప విప్లవం కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు

ప్రజలు పనుల నిమిత్తం మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయి. దీంతో గతంలో ఎక్కడకో వెళ్లి దరఖాస్తు చేయడం, రాజకీయ నేతల చుట్టూ తిరగడం, లంచాలు ఇవ్వడం.. ఇలాంటి కష్టాలన్నింటికీ బ్రేక్ పడింది. ఉన్న ఊరిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అర్హత ఉంటే చాలు.. ఎవరి సిఫార్సు లేకుండానే సేవలు, పథకాలు అందుతున్నాయి. గతంలో రూపాయి ఇస్తే పావలా మాత్రమే లబ్ధిదారులకు చేరేది. ఇప్పుడు నేరుగా నగదు బదిలీ ద్వారా రూపాయి ఇస్తే రూపాయి లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళ్తోంది. గత నాలుగేళ్లలో నవరత్నాల పథకాల ద్వారా రూ.2.11 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు జమ అయింది. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, పెన్షన్, ఇంటి జాగా ఇలా ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా.. లేదా ఏ ప్రభుత్వ సేవలు కావాలన్నా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అందుతున్నాయి. గతానికి, ఇప్పటికీ ఇదో గొప్ప మార్పు.

రేషన్ డోర్ డెలివరీతో రోల్ మోడల్

పేదల ఇంటి వద్దకే రేషన్ డోర్ డెలివరీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్‌గా నిలిచింది. ఏ పల్లెలో అయినా, పట్టణంలో అయినా రేషన్ బియ్యం మన వీధికి, మన ఇంటి ముంగిటకే అందించే వ్యవస్థ దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే అమల్లో ఉంది. మిగతా రాష్ట్రాలు ఈ వ్యవస్థను అమలు చేసేందుకు యత్నిస్తున్నాయి. రేషన్ షాపుల దగ్గర గంటల తరబడి క్యూలో నిలబడే దుస్థితిని నివారించి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 9,260 డెలివరీ వ్యాన్‌లతో నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని నెలనెలా డెలివరీ చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఏపీ ఒక్కటే.

అవ్వాతాతల ఇంటికే ప్రతి నెలా పెన్షన్

దేశంలో ఎక్కడా లేని విధంగా పేద అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు, దీర్ఘ వ్యాధిగ్రస్తుల ఇంటికే ప్రతి నెలా పెన్షన్‌ను వలంటీర్ల ద్వారా అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే వలంటీర్ ఇంటింటికీ వచ్చి లబ్ధిదారుల చేతిలో పెన్షన్ సొమ్ము పెట్టే కార్యక్రమం సజావుగా సాగుతోంది. అర్హులైన పేదలకు పెన్షన్ మంజూరు, పంపిణీలో వచ్చిన మరో గొప్ప మార్పు ఇది.

వ్యవసాయం పండుగైంది

దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం 10,778 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ కేంద్రాలు విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి సేవలోనూ రైతన్నకు తోడుగా ఉంటూ, వారి చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. ఆర్బీకేలలో 10,778 మంది అగ్రికల్చర్, హార్టికల్చర్ గ్రాడ్యుయేట్లు పని చేస్తూ రైతులకు తోడుగా ఉన్నారు.



'ఫ్యామిలీ డాక్టర్'తో ఆరోగ్యానికి భరోసా

రాష్ట్రంలో 10,592 గ్రామ, పట్టణ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఉచితంగా చికిత్సలను అందుబాటులోకి తెస్తూ ప్రభుత్వం ఈ రంగంలో గొప్ప మార్పులను తీసుకొచ్చింది. ఈ క్లినిక్స్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ 24 గంటలూ అందుబాటులో ఉంటారు. 105 రకాల మందులు ఉంటున్నాయి. 14 రకాల పరీక్షలు చేస్తూ.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానమై అక్కడే సేవలందిస్తూ కనిపిస్తున్నారు. గతానికి ఇప్పటికి వ్యవస్థలో ఇదో స్పష్టమైన మార్పు.

కొత్తగా మరో 13 జిల్లాలు

రాష్ట్రంలో 2019 నాటికి 13 జిల్లాలు ఉంటే జిల్లా పాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వం కొత్తగా 13 జిల్లాల ఏర్పాటు ద్వారా మొత్తం 26 జిల్లాలను చేసింది. 51 డివిజన్లను 78కి, 679 మండలాలను 691కి పెంపు ద్వారా మరింతగా పాలనను వికేంద్రీకరణ చేసింది. ఆఖరికి చంద్రబాబు నియోజకవర్గం కేంద్రమైన కుప్పంను రెవెన్యూ డివిజన్‌గా చేసింది ప్రస్తుత ప్రభుత్వమే. ప్రజలకు జిల్లా, డివిజన్, మండల పాలన సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా వికేంద్రీకరణ చేపట్టింది. ఇది పరిపాలన రంగంలో గొప్ప సంస్కరణగా నిలుస్తోంది.

సమగ్ర భూ సర్వేతో వివాదాలకు స్వస్తి

భూ వివాదాలకు శాశ్వత ముగింపు దిశగా వందేళ్ల తర్వాత సమగ్ర భూ సర్వే చేపట్టి గ్రామ స్థాయిలో గొప్ప మార్పునకు నాంది పలికింది. సమగ్ర భూ సర్వే కోసం గ్రామాలు, పట్టణాల్లో ఏకంగా 10,185 మంది సర్వేయర్లను నియమించింది. 40 డ్రోన్లు కొనుగోలు చేసింది. కబ్జాలకు, భూ వివాదాలకు శాశ్వతంగా స్వస్తి పలుకుతూ.. ప్రజల భూములపై శాశ్వత భూ హక్కును కల్పిస్తూ స్పష్టమైన భూ రికార్డులకు ప్రభుత్వం నాంది పలికింది.

టెండర్ల విధానంలో పారదర్శకత

జ్యుడీషియల్ ప్రివ్యూతో పాటు రివర్స్ టెండర్ ద్వారా టెండర్ల విధానంలో పారదర్శకతకు పెద్ద పీట వేసింది. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తొలిసారి జ్యుడీషియల్ ప్రివ్యూను ఏర్పాటు చేసింది. ఇందుకోసం ఏపీ మౌలిక సదుపాయాలు (తొలుత న్యాయ పరమైన సమీక్ష ద్వారా పారదర్శకత) చట్టం–2019ను అమల్లోకి తెచ్చింది. రూ.100 కోట్లు పైబడిన పనుల టెండర్లన్నీ జ్యుడీషియల్ ప్రివ్యూకు వెళ్తున్నాయి. రివర్స్ టెండర్ ద్వారా ప్రజా ధనం ఆదాకు పెద్దపీట వేస్తూ తెచ్చిన సంస్కరణలు మంచి ఫలితాలిస్తున్నాయి.

'స్పందన'తో ప్రజా సమస్యల పరిష్కారం

అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రజా సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి 'స్పందన' కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లో సంబంధిత ఉన్నతాధికారులు స్వయంగా నిర్వహిస్తున్నారు. 1902కు ఫోన్ చేసి సమస్యను చెబితే.. దాన్ని నమోదు చేసుకుని నిర్ణీత సమయంలోగా పరిష్కరించే ఏర్పాటు చేశారు. దీన్ని మరింత నాణ్యతతో అమలు చేయడంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమంగా మార్చారు. ఇది ప్రజల సమస్యల పరిష్కారానికి వ్యవస్థలో తీసుకువచ్చిన గొప్ప మార్పుగా నిలుస్తోంది.

మహిళా సాధికారత దిశగా అడుగులు

మహిళలకు ప్రభుత్వ నామినేటెడ్ పనులు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకంగా చట్టాలు చేసి, అమలు చేస్తోంది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ మహిళల కోసం ఇలాంటి చట్టాలు చేసిన దాఖలాల్లేవు. జెండర్ బేస్డ్ బడ్జెట్ పేరుతో మహిళలకు, పిల్లలకు బడ్జెట్ ప్రత్యేక కేటాయింపులు చేస్తోంది. 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను మహిళల పేరిట ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇదే. మహిళా సాధికారత దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో స్థాపించే పరిశ్రమలు, కంపెనీల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో 75 శాతం ఇవ్వాలని ప్రత్యేకంగా చట్టం చేసి, అమలు చేస్తోంది. స్థానికంగా యువతకు ఎక్కువగా ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగాలను ప్రోత్సహిస్తోంది.

మారిన విద్య, వైద్య రంగాలు

ప్రజలకు విద్య, వైద్యం అందించాల్సిన కనీస సామాజిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది. ఈ రెండు రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ మార్పులకు శ్రీకారం చుట్టడంతో ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలోని విద్య, వైద్య సంస్థలను వేగంగా బలోపేతం చేస్తున్నారు. మారుతున్న సాంకేతికతతో పాటు భవిష్యత్‌లో అవసరమైన రంగాల్లో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు బోధనా పద్ధతుల్లో, పాఠ్యాంశాల్లో మార్పులు తెచ్చారు. నైపుణ్యాలతో కూడిన యువతను తయారు చేయడానికి బాటలు వేశారు. వైద్య రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మార్పులు తెచ్చారు. రెండేళ్లలోనే 48,639 మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడం ద్వారా అన్ని స్థాయి వైద్య సంస్థల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందుబాటులోకి తెచ్చారు.

నాడు ఎన్టీఆర్‌ను తిట్టారు.. నేడు దండలు వేస్తున్నారు

చంద్రబాబు, టీడీపీ నేతల తీరుపై ఆర్జీవీ, పోసాని, లక్ష్మీపార్వతి ఆగ్రహం

- రాజమండ్రిలో జరుగుతున్నది పెద్ద జోక్
- ఎన్టీఆర్ కూడా నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కాని జోక్ అది
- చంద్రబాబు, టీడీపీ నేతల తీరుపై సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ విమర్శ
- వైఎస్సార్‌సీపీని మళ్లీ మళ్లీ గెలిపిస్తేనే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి
- ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి
- విజయవాడలో ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు
- ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో నిర్వహణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): 'నేను ఒక సీరియస్ జోక్ చెప్పడానికే ఇక్కడికి వచ్చాను. ఆ జోక్ ప్రస్తుతం రాజమండ్రిలో జరుగుతోంది. స్వర్గంలో ఉన్న ఎన్టీఆర్ కూడా నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కాని జోక్ అది. ఆయన మరణానికి కారణమైన వాళ్లే.. ఇప్పుడు ఎన్టీఆర్ కంటే గొప్ప వ్యక్తి లేరు అంటూ కీర్తిస్తున్నారు' అని టీడీపీ మహానాడును ఉద్దేశించి సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ అన్నారు. నాడు లక్ష్మీపార్వతితో ఉన్న ఎన్టీఆర్‌ను తిట్టిన వాళ్లే.. నేడు ఆయనకు ఎందుకు దండలు వేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అతిథులు ఎన్టీఆర్ లలిత కళా అవార్డును పోసాని కృష్ణమురళికి ప్రదానం చేశారు. అనంతరం రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ.. చంద్రబాబు ఎలాంటి వ్యక్తి అనేది స్వయంగా ఎన్టీఆరే చెప్పారన్నారు. రజనీకాంత్ లాంటి వ్యక్తి రాష్ట్రానికి వచ్చి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన వాళ్లతో కూర్చున్నారంటే.. ఒకరకంగా ఆయన కూడా ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడుస్తున్నట్లేనన్నారు. నందమూరి కుటుంబంలో ఉన్న ఒకే ఒక్క మగాడు జూనియర్ ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. తాతకు వెన్నుపోటు పొడిచిన వారితో వేదిక పంచుకోవడం ఇష్టం లేకే.. ఆయన వీళ్లందరికీ దూరంగా ఉంటున్నారన్న విషయం స్పష్టమవుతోందన్నారు. తాను 'వ్యూహం' సినిమా తీస్తున్నానని, అందులో చంద్రబాబు క్యారెక్టర్‌ను అరటిపండులా వలిచి చూపిస్తానని ప్రకటించారు.



పోసానికి ఎన్టీఆర్ లలిత కళా పురస్కారం అందజేస్తున్న లక్ష్మీపార్వతి, రామ్‌గోపాల్‌వర్మ తదితరులు

లక్ష్మీపార్వతిపై బాబు వదంతులు

ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ.. ఏ కులం, ఏ మతం వారితో అయినా స్నేహం చేయవచ్చు కానీ.. గుణం లేని వారితో మాత్రం చేయకూడదన్నారు. గుణం లేని వాడు చంద్రబాబు అని.. అతనికి దూరంగా ఉండటం చాలా మంచిదని సూచించారు. తన మంచిచెడులు చూసుకునేందుకు లక్ష్మీపార్వతిని ఎన్టీఆర్ ఆహ్వానించారని, కానీ ఆమెపైనా చంద్రబాబు అనేక పుకార్లు పుట్టించారని చెప్పారు. చంద్రబాబు వల్ల ఎన్టీఆర్‌కు మూడుసార్లు గుండెపోటు వచ్చినా.. లక్ష్మీపార్వతి ఒక్కరే అండగా నిలిచారని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు.

బాబు కుట్రలకు ఎన్టీఆర్ కుమిలిపోయారు

తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. అడ్డదారుల్లో అధికారాన్ని లాక్కునేందుకు చంద్రబాబు చేసిన కుట్రలపై ఎన్టీఆర్ ఎంతగానో కుమిలిపోయారని చెప్పారు. ఎన్టీఆర్‌ను అడుగడుగునా వేధింపులకు గురిచేశారన్నారు. ఎన్టీఆర్ కష్టకాలంలో దేవినేని నెహ్రూ అన్నీ తానై నిలిచారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ పేరుతో జిల్లా ఏర్పాటు చేసినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన గౌరవాన్ని నిలబెట్టిన జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ప్రారంభించిన పథకాలు ఎప్పటికీ చిరస్మరణీయమేనని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పార్టీ స్థాపించినప్పటి నుంచి మరణించే వరకు ప్రతి ఘటననూ తాను ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. ఎన్టీఆర్ లాంటి గొప్ప మనిషి కూడా చంద్రబాబు కుట్రకు బలయ్యారన్నారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్, వైఎస్సార్ ఒక కులానికో, పార్టీకో పరిమితం కాదన్నారు. వారు మహనీయులని.. తెలుగు జాతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. సభలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

దేశ సుభిక్షం కోసమే సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న విజయ గోపాలకృష్ణ

పినపాక: దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాలోని సింగూర్ గ్రామానికి చెందిన విజయ గోపాలకృష్ణ సైకిల్ యాత్ర చేపట్టారు. 440 రోజులుగా సుమారు 39 వేల కిలోమీటర్లు సైకిల్‌పై అనేక రాష్ట్రాలు తిరుగుతూ ఆదివారం బయ్యారం క్రాస్ రోడ్డుకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల, జంతు, నవ సంరక్షణ కోసం గత కొన్ని నెలలుగా యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా పలు ప్రసిద్ధ దేవాలయాలను దర్శించుకున్నట్లు చెప్పారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ. 34,375



రిజర్వాయర్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని పరిసరాలు ఆదివారం సందడిగా మారాయి. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పై నుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం బోటు షికారు చేశారు. 563 మంది పర్యాటకులు ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.19,255, 280 మంది బోటింగ్ చేయడం ద్వారా టూరిజం శాఖకు రూ.15,120 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

స్పీడ్ బోట్‌కు మరమ్మతులెప్పుడో..?

కిన్నెరసానిలోని ఆరుసీట్ల సామర్థ్యం గల స్పీడ్ బోట్ ఇంజన్ వారం క్రితం మరమ్మతులకు గురైంది. ఇప్పటివరకు రిపేర్ చేయించకపోవడంతో పర్యాటక శాఖ భారీగా ఆదాయం కోల్పోతోంది. ఈ బోట్ ద్వారా ప్రతి ఆదివారం రూ.10వేలకు పైగా ఆదాయం సమకూరేది. పర్యాటకులు సైతం దీనిపై బోటింగ్ చేసేందుకే ఎక్కువగా ఇష్టపడతారు. బోట్ ఇంజన్‌ను మరమ్మతు కోసం ఆపరేటర్ హైదరాబాద్‌కు తీసుకెళ్లినా.. ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. దీంతో పర్యాటకులు నిరుత్సాహానికి గురవుతుండగా, టూరిజం శాఖ ఆదాయం కోల్పోతోంది.

పెరుగుతున్న నిర్వాసిత జాబితా



నిర్వాసిత ప్రాంతంలో సర్వే చేస్తున్న సింగరేణి, రెవెన్యూ అధికారులు (ఫైల్)

- ఇల్లెందు జేకేఓసీ నిర్వాసితుల సంఖ్యపై భిన్నవాదనలు
- అయినా మరికొన్ని పేర్లతో నేతల నుంచి అధికారులకు సిఫారసులు
- పరిహారమే తప్ప ఉద్యోగాలు రావని స్పష్టంచేస్తున్న 'సింగరేణి'
- ఉద్యోగాల పేరిట నమ్మబలికి వసూళ్లకు పాల్పడుతున్న పలువురు?

ఇల్లెందురూరల్: పట్టా ఉన్నా లేకపోయినా.. గిరిజనులైనా, గిరిజనేతరులైనా సాగులో ఉన్న భూనిర్వాసితులందరికీ పరిహారం చెల్లిస్తామని పలుమార్లు రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. అయినా ఎక్కడో నెలకొన్న భయంతో ఓ గిరిజనేతర రైతు చేసిన తప్పిదం ఇప్పుడు ఇల్లెందులోని సింగరేణి జేకే ఓసీ నిర్వాసిత జాబితానే తప్పుపట్టే స్థితికి చేర్చింది. నిర్వాసిత జాబితాలో కొత్త రైతుల పేర్లు ఉన్నాయన్న స్థానికుల అభ్యంతరం వాస్తవమే అయినా వాస్తవ రైతు నుంచి అభ్యంతరాలు లేకపోవడంతో అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. కానీ, నిర్వాసిత జాబితాలో రైతుల సంఖ్య ఎలా పెరిగింది, అందుకు కారణాలేమిటనే ప్రశ్నలు అందరి మదిని తొలుస్తున్నాయి. ఈ విషయంలో స్థానిక నేతలు ఒకరిద్దరి పాత్రపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

వాస్తవ భూవిస్తీర్ణం 154 హెక్టార్లు

ఇల్లెందులో జేకే–5 ఓసీలో బొగ్గు నిల్వలు తరిగిపోవడంతో సింగరేణి యాజమాన్యం జేకేఓసీ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకోసం భూసేకరణలో భాగంగా మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ సమీపాన అటవీశాఖ పరిధిలోని సర్వే నంబర్ 549లో 261.33 హెక్టార్ల భూభాగం అవసరమైంది. ఇందులో ఇప్పటికే కొంతమంది రైతులు సాగు చేసుకుంటున్నట్లు సింగరేణి అధికారులు గుర్తించారు. సర్వే ఆధారంగా నిర్వాసిత భూమి 154 హెక్టార్లుగా నిర్ధారించారు.

ముందస్తు సమాచారంతో..

సాధారణంగా నిర్వాసిత రైతులకు సింగరేణి ద్వారా మెరుగైన ప్యాకేజీ లభిస్తుంది. అంతేకాకుండా గతంలో జేకే–5 ఓసీ గిరిజన నిర్వాసితులకు ఉద్యోగాలు కూడా ఇవ్వడంతో జేకేఓసీ విస్తరణలోనూ భూమి కోల్పోయే గిరిజన రైతులకు కూడా ఉద్యోగాలు వస్తాయని ఊహించారు. కానీ, జీఓ 34 ప్రకారం ఉద్యోగ అవకాశాలు ఇచ్చే అవకాశాన్ని ప్రభుత్వం 2015–16 ఆర్థిక సంవత్సరంలో రద్దు చేసింది. అప్పటికే జేకే–5 ఓసీ నిర్వాసితుల వివరాలు నమోదు కావడంతో వారికి మాత్రం ఉద్యోగాలు వచ్చాయి. ఈ విషయం తెలియని చాలా మంది గిరిజనులు ఈ ప్రాంతంలో భూములు కొనేందుకు ఉత్సాహం చూపించారు. ఈ విషయాన్ని గుర్తించి రంగప్రవేశం చేసిన దళారీ, సీఎస్పీ బస్తీ గ్రామానికి చెందిన ఒక గిరిజనేతర రైతును బుట్టలో వేసుకుని ఆయన నుంచి ఏడుగురు గిరిజన రైతులు 18 ఎకరాల భూమిని 2017లో కొన్నట్లుగా పత్రాలు సృష్టించారు. ఇదంతా సాఫీగానే సాగడంతో ఉద్యోగం వస్తుందని ఉత్సాహంగా ఉన్న గిరిజన రైతులను గుర్తించి 18 ఎకరాలను ఒక్కొక్కరికి 20 గుంటలు చొప్పున 36 మందికి సంబంధిత దళారీ విక్రయించారు. ఇందుకోసం వాస్తవ భూమి ధరతోపాటు ఉద్యోగం వస్తుందని నమ్మబలికి అదనంగా పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లుగా సమాచారం.

జాబితాలోకి కొత్తగా 36 మంది పేర్లు..

దళారీ నుంచి ఒక్కొక్కరు 20 గుంటలు చొప్పున 18 ఎకరాలు కొనుగోలు చేసిన 36 మంది రైతుల పేర్లు నిర్వాసితుల జాబితాలో 2021 జూలై 31న నిర్వహించిన గ్రామసభ నాటికే నమోదయ్యాయి. దీంతో తమ వ్యూహం ఫలించిందని దళారీ, ఆయన మిత్ర బృందం సంబరపడింది. దీనిని గుర్తించి మరికొందరు గిరిజన రైతులు భూమిని తమ కుటుంబ సభ్యులకు కేటాయించి వారి పేర్లను కూడా నిర్వాసితుల జాబితాలో నమోదు చేయించారు. ఫలితంగా నిర్వాసిత రైతుల సంఖ్య ఏకంగా 107కు పెరిగింది. అంతేకాకుండా తాజాగా నిర్వహించిన ఆర్‌ఓఎఫ్ఆర్ గ్రామసభ నాటికి ఆ సంఖ్య 114కు చేరడం గమనార్హం. ఈ తతంగాన్ని గుర్తించిన పలువురు రైతులు గ్రామసభలో జాబితాలో కొత్త రైతుల పేర్లు ఉండడంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో మొత్తంగా జేకే ఓసీ నిర్వాసిత జాబితా వివాదాస్పదమైంది. ఈ వివాదం కొనసాగుతుండగానే మరో 15 మంది పేర్లు నమోదు చేయాలని అధికారులకు సమాచారం అందింది. ఈ సిఫారసు చేసిన వారు రాజకీయ పెద్దలు కావడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు.

రైతుల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలు



జేకేఓసీ నిర్వాసిత ప్రాంతంగా గుర్తించిన వాస్తవ విస్తీర్ణానికి మాత్రమే పరిహారం చెల్లిస్తాం. క్షేత్రస్థాయి విచారణ ద్వారా ఇప్పటివరకు వచ్చిన అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించాం. రైతుల సంఖ్య పెరగడంపై వస్తున్న ఆరోపణల నేపథ్యాన ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

–కృష్ణవేణి, తహసీల్దార్, ఇల్లెందు

కార్మిక హక్కులను మోదీ కాలరాస్తున్నారు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్

సింగరేణి(కొత్తగూడెం): దేశ స్వాతంత్ర్యానికి ముందే పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల చట్టాలను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ సర్కార్ మతోన్మాద అజెండాను ముందుకు తీసుకొస్తూ దేశంలో కుల, మత ఘర్షణలకు కారణమవుతోందని విమర్శించారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న భారతదేశాన్ని మత విద్వేషాలతో రెచ్చగొట్టడం తగదని హితవు పలికారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.బ్రహ్మాచారి, ఏజే రమేష్, నాయకులు భూక్యా రమేష్, పద్మ, ఏంపీ అప్పారావు, గద్దల శ్రీను, పిట్టల అర్జున్, ఈసం వెంకటమ్మ, డి.వీరన్న, కె.సత్య, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

రేపటి నుంచి జాతీయ మహిళా టీ–20 క్రికెట్ టోర్నీ



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ప్రదీప్‌కుమార్ తదితరులు

- ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు
- ఎనిమిది రోజుల పాటు సీజన్–2 మ్యాచ్‌ల కొనసాగింపు

ఖమ్మం స్పోర్ట్స్ : యువం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా మహిళా టీ–20 క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో జాతీయస్థాయి మహిళా టీ –20 క్రికెట్ టోర్నమెంట్‌ను నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు యువం ఫౌండేషన్, ఖమ్మం మహిళా క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 30 నుంచి జూన్ 6వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, డయ్యూ డామన్, మహారాష్ట్ర, గుజరాత్, బీహార్, ఉత్తరాఖాండ్, జమ్ము కశ్మీర్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మహిళా క్రికెటర్లు పాల్గొంటారని వివరించారు. మొత్తం 180 మంది క్రీడాకారులతో పాటు అధికారులు హాజరవుతారని తెలిపారు. నగరంలోని ప్రముఖ లాడ్జిలలో క్రీడాకారులకు వసతి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఆయా రాష్ట్రాలకు అనుగుణంగా భోజన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సీజన్–2లో విజేతలుగా నిలిచిన జట్లకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు అందజేస్తామని చెప్పారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు కొనసాగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ మతిన్ మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు మ్యాచ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. టోర్నీ పరిశీలనకు జాతీయ కార్యదర్శి సందీప్ ఆర్యను నియమించినట్లు వివరించారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జట్టుకు కోచ్, మేనేజర్‌గా ఝూన్సీ, వినోద వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

బంక్‌కు కాదు.. బ్యాంక్‌కు వెళ్లాలి..

రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఆర్‌బీఐ.. సెప్టెంబర్ 30వ తేదీలోపు బ్యాంకుల్లో మార్చుకోవాలని సూచించింది. అయితే, చాలామంది బ్యాంకుల్లో కాకుండా ఇతర మార్గాల్లో మార్చుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే రూ.50, రూ.100, రూ.200 పెట్రోల్ పోయించుకుని బంకుల్లో రూ.2 వేల నోట్లు ఇస్తుండడంతో చిల్లర తిరిగి ఇవ్వడం బంక్ సిబ్బందికి తలనొప్పిగా మారింది. దీంతో ఖమ్మంలోని ఓ బంక్ వద్ద రూ.2 వేలు ఆపైన పెట్రోల్ కొనుగోలు చేస్తేనే రూ.2 వేల నోట్లు తీసుకుంటామని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కరెన్సీ మార్పిడి సదుపాయం బ్యాంకులకే పరిమితమనే సూచన కూడా చేయడం విశేషం!

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

